# యాక్సిడెంట్

## మినీ కథ



## పాలకోడేటి సత్యనారాయణరావు

అతన్ని మీరు ఆ రోడ్డులో ఏదో ఒక చౌరస్తా దగ్గర చూసే ఉంటారు. ట్రాఫిక్‌లైట్లతో సమంగా తనూ ఓ స్థంభమై నిలబడి ఉంటాడు.

నాకతని పేరేమిటో తెలీదు. కానీ తెల్లటి యూనిఫాంలో అతను నాకు బాగా పరిచయం. ప్రతిరోజూ ఆఫీసుకు వెళ్ళేటపుడు, తిరిగి వచ్చేటపుడు ఆ చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్స్‌లో ఎర్రదీపంచూసి ఆగినపుడు, అతన్నిచూస్తుంటాన్నేను. ట్రాఫిక్‌లైట్లకు ఆటోమేటిక్ స్విచెస్ ఉన్నాయి కానీ, ఇతనికి అవిలేకపోయినా, ఆ దీపాలతో సమంగా ప్రతి స్పందిస్తూ ఉంటాడు.

ఓసారి చెయ్యెత్తి 'వెళ్ళండి' అంటాడు. మరోసారి ఎర్రదీపం ఉన్నా ఆగకుండా వెళ్ళిపోయే ప్రయత్నంచేసే ఏ సైక్లిస్టునో తెగ కేకలేస్తుంటాడు-'ఏం, ఇంట్లో చెప్పేవచ్చావా ?' అని వేళాకోళం ఆడుతుంటాడు.

అతన్ని చూస్తోంటే-నాకెప్పుడూ అతను అక్కడే కనిపిస్తుంటాడు. దారితప్పిపోతున్న ఈ జనాన్ని సరైనదారిలో పెట్టేందుకే తన జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తిగా-కనిపిస్తుంటాడు నాకు. రాత్రి పగలు తేడాలేదు. ఎప్పుడూ ట్రాఫిక్ కంట్రోల్‌లోనే, తన విధి నిర్వహణలోనే నిమగ్నమయి కనిపించే అతన్ని చూసి, ఒకటి రెండుసార్లు నేనే సిగ్గుపడ్డాను. 'అతనంత సరిగ్గా నేను నా ఉద్యోగాన్ని చేస్తున్నానా ?' అని చాలాసార్లు ప్రశ్నించుకొని, సరైన సమాధానం చెప్పుకోలేక తలవంచుకొన్నాను.

ఈ కారణంగానే కాబోలు, అతనిపట్ల నాకు ఆరాధనా భావం పెరిగింది. ఆ రోడ్డుమీద వెళ్ళే వాళ్ళలో పదోవంతుమంది అతని కార్యదీక్షను అలవర్చుకొంటే, దేశం బాగుపడుతుందనిపించేది.

రోజూ ఒక్కసారైనా అతన్నిచూడకపోతే ఏదో లోపంగా అనిపించేది నాకు-అతను అప్పుడే మూడురోజులనుంచి కనిపించటంలేదు.

నాకేదో వెలితిగా అనిపించసాగింది. ఆ తర్వాత వారంరోజులకూ అతను కనిపించకపోయేసరికి చికాకు పెరిగిపోయింది నాలో.

ఆఖరికి ఆరోజు...ట్రాఫిక్‌లైట్ల దగ్గర స్కూటరుఆపి, అక్కడున్న ఇంకో కానిస్టేబుల్‌ను అడిగాను. అతనిపేరు తెలీదు గనక తెలిసిన గుర్తులన్నీ చెప్పాను.

"ఓ, కోటిలింగంగారిసార్ మీరు చెప్పేది ! లీవ్‌లో ఉన్నాడు !" అని జవాబిచ్చాడు ఆ కానిస్టేబుల్.

యాక్సిడెంట్ ఏమీ కాలేదన్న సంగతి తెలిసాక, మనసొకింతకుదుటబడింది. అయినా అతన్ని చూడాలన్న కోరికతో ఇంటి అడ్రస్ తీసుకొని, కోటిలింగం ఇంటికెళ్ళాను. గుర్తుపట్టడం కష్టంకాలేదు. ఇంటిముందు దిగాలుగా కూర్చునిఉన్నాడు కోటిలింగం.

నాపేరు అతనికి తెలీకపోయినా, నన్ను గుర్తుపట్టి సాదరంగా ఆహ్వానించాడు.

"ఇన్నాళ్ళనుంచి డ్యూటీకి రావటంలేదేం? మీరులేకపోతే ఆ రోడ్డంతా చిన్నబోయినట్టుంది!" అన్నాను నిజాయితీగా.

కోటిలింగం నవ్వాడు. ఆ నవ్వులో విషాదం కూడా తొంగిచూసింది.

"ఏం చెప్పమనసార్-రోడ్డుమీద ట్రాఫిక్ సరిచెయ్యటంలోనే కాలంగడిపేవాడిని. ఇంట్లో ట్రాఫిక్ దారితప్పిపోతే ఏం చెయ్యాలో తెలీక' ఇలా కూర్చుండిపోయా ! మా పెద్దమ్మాయి... ఎవరితోనో లేచిపోయిందిసార్ ! మా ఫామిలీలో యాక్సిడెంట్ జరిగిపోయింది ! నా నడుం విరిగిపోయింది !" అంటూనే కళ్ళనీళ్ళు పెట్టుకొన్నాడు కోటిలింగం.

నా గుండె తరుక్కుపోయింది- అతనన్నట్టు అతనిజీవితంలో యాక్సిడెంటయిపోయింది. రోడ్డుమీద యాక్సిడెంట్ అయితే నష్టపరిహారం అయినా ఉంటుంది. కానీ...కార్యనిర్వహణలో ఉండిపోయి, కుటుంబంలో యాక్సిడెంట్ చేసుకొన్న కోటిలింగానికేదీ నష్టపరిహారం ? !

### ఓ కథ రాయండి

ఈ క్రింద ఇచ్చిన వాక్యాన్ని కథలో ఎక్కడయినా వుపయోగించి అచ్చులో అరపేజీ మించకుండా ఓకథనిరాసి వెంటనే పంపండి. ప్రచురార్హమైన కథారచయితలకి పారితోషికం పంపబడుతుంది.

"అవును. నా పేరు చంద్రశేఖర్." చెప్పాడు [illegible].

పంపవలసిన చిరునామా :
స్రవంతి
వినూత్న వారపత్రిక
6-3-1099/2 రాజ్‌భవన్ రోడ్
పి.బి. నం. 16. సోమాజిగూడ,
హైదరాబాద్-500 482.